

డ్యూటీ చేయాలంటే భయపడుతున్నారు



కోల్‌కతా సంఘటన తరువాత మహిళ వైద్యులు, వైద్యసిబ్బంది రాత్రుళ్లు విధులు నిర్వర్తించాలంటే భయపడుతున్నారు. రాత్రి వేళలో పరిస్థితి మరింత దారుణం. వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వాలు ఆసుపత్రులలో పనిచేసే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన యావత్ సమాజం తలదించుకునేలా ఉంది. దోషులను కఠినంగా శిక్షించాలి.

– డా.మనీషా, వైద్యాధికారి, వీరబల్లి

పీహెచ్‌సీలలో భద్రత పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో పోలీస్ భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రసూతి పీహెచ్‌సీ విభాగంలో 24 గంటలు విధుల్లోనే ఉంటారు. డాక్టర్లతోపాటు నర్సులు కూడా ఉంటారు. అర్ధరాత్రి సమయంలోనూ పేషెంట్లు వస్తూ ఉంటారు. రోగుల బంధువుల నుంచి రాత్రి సమయంలో ఇబ్బందులు కలుగకుండా చూడాలి. వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలి.

– అరుణకుమారి, ఏఎన్‌ఎం, నూలివీడు, గాలివీడు

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



వైద్యులది ప్రాణం పోసే వృత్తి. అలాంటి వైద్యులను అమానుషంగా, రాక్షసంగా బలి తీసుకుంటున్నారు. కోల్‌కతా సంఘటన మానవత్వానికి మచ్చవంటిది. ఈ సంఘటనలో దోషులను కచ్చితంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలి. మాకు భద్రత కల్పిస్తే కష్టపడి పనిచేసి రోగులకు మెరుగైన సేవలందించేందుకు వీలవుతుంది.

– డాక్టర్ మనోజ్ చంద్ర, వైద్యులు, పుల్లంపేట

కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా లాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి. వైద్యులపై నేరాలకు పాల్పడినవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులలో నెలకొన్న భయాన్ని పోగొట్టి వారికి రక్షణ కల్పించాలి. వైద్యులు అభద్రతా భావానికి గురైతే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేం.

– డాక్టర్ సినీజ, వైద్యురాలు, పుల్లంపేట

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 750 మంది విద్యార్థులకు విడతల వారీగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించి మందులను సరఫరా చేస్తామని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సురేష్ తెలిపారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం 350 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని కంటి వైద్యులు డాక్టర్ లక్ష్మీకర్‌రెడ్డి, డాక్టర్ విజయరాజులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

నృత్య పోటీలో విద్యార్థి ప్రతిభ

నందలూరు : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇండియా కల్చరల్ సిటిజెన్ వెల్ఫేర్ ఫోరం సంయుక్తంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇండియన్ కన్వెన్షనల్ డ్యాన్సింగ్ కంటెంట్‌లో నందలూరు సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థి ఎస్.ఫజిల్ పాల్గొని బహుమతి పొందాడు. చిన్న వయసులో స్టేజ్ ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ భూమన్ శివశంకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కమల ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శౌరీ, లోక్‌మాన్ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామంలో మంగళవారం వర్షాలు కురవాలంటూ గుంటితిమ్మన్న స్వామికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మన్న స్వామితోపాటు విష్ణుమూర్తి దేవుళ్లకు పూజలు జరిపారు. వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలంటూ గ్రామ దేవుడికి మొక్కుకున్నారు.

సంతాపం



నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : సుద్దమళ్ల గ్రామం బయారెడ్డిగారిపల్లెకు చెందిన గడికోట వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. వెంకటసుబ్బారెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. అతని మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం హసనాపురం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు చలమారెడ్డి, ఆంజనేయరెడ్డి, వసంత రామిరెడ్డిలను మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై ఆయన చర్చించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

రాయచోటి టౌన్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో, కారు, జీపు డ్రైవర్ అందరూ తప్పకుండా యూనిఫాం ధరించాలని చెప్పారు. అలాగే ట్రాఫిక్ నియమ, నిబంధనలు తప్పకుండా పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

నిర్లక్ష్యం ఖరీదు.. పెనుప్రమాదమే!

- గాలివీస్తే నేలకొరిగేలా ఉస్మానగర్‌లోని విద్యుత్ స్తంభం
- డ్రైవింగ్ ట్రాక్ టెస్టుకు అడ్డంకిగా విద్యుత్ స్తంభాలు, తీగలు
- ఫిర్యాదులు వస్తున్న పట్టించుకోని రాజంపేట కరెంటోళ్లు



రాజంపేట: రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవింగ్ టెస్ట్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం, తీగలు



రాజంపేట టౌన్: ఉస్మానగర్‌లో నేలకొరిగే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం

రాజంపేట/రాజంపేట టౌన్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం తారాస్థాయికి చేరుకుంది. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఇళ్ల దగ్గర వేలాడుతూ ప్రమాదాలకు ఆస్కారం కలిగించేలా కనిపిస్తోంది. రాజంపేట పట్టణం ఉస్మానగర్‌లో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇక్కడ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ఉంది. ఈ విషయాన్ని ఇక్కడి ప్రజలు అనేక మార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా నేలకొరిగే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభానికి పక్కనే దాదాపు రెండు నెలల క్రితం కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అయితే కొత్త విద్యుత్ స్తంభానికి విద్యుత్ తీగలను ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో ఉస్మానగర్‌కు చెందిన ప్రజలు తమ సమస్య పరిష్కారం కోసం విద్యుత్‌శాఖ అధికారులకు తరచూ మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. ఇక రాబోయేది గాలికాలం అని ఓ మోస్తారు గాలివీచినా విద్యుత్ స్తంభం నేలకొరుగుతుందని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విద్యుత్ స్తంభానికి ఎదురుగా ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. స్తంభం నేలకొరిగితే విద్యుత్ తీగలు పాఠశాల ఆవరణలో పడే అవకాశం ఉంది. పొరపాటున అలాంటి సంఘటన జరిగితే మాటలకు అందని ప్రమాదం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనావుంది. లేకుంటే ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అందుకు విద్యుత్‌శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని ఉస్మానగర్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు కలిపి కడప – రేణిగుంట జాతీయ రహదారిలోని ఎర్రబల్లి సమీపంలో ఉన్న డెమో కారిడార్ భవనంలోని రవాణాశాఖ కార్యాలయ క్యాంపస్‌లో ఉన్న డ్రైవింగ్ ట్రాక్‌కి ప్రమాదకరంగా కరెంటు స్తంభాలు అడ్డంకిగా ఉన్నాయి. డ్రైవింగ్ టెస్టుకు వచ్చిన వారు భయాందోళనకు గురవుతున్నారు. ట్రైల్స్‌లో ఎక్కడ స్తంభాలను గుద్ది పొరపాటున ప్రమాదాలు సంభవిస్తాయన్న ఆందోళనలో డ్రైవింగ్ టెస్టుకు వచ్చే వారు జంకుతున్నారు. నిత్యం డ్రైవింగ్ టెస్టు కోసం ట్రాక్‌లో టూ వీలర్, ఫోర్ వీలర్, బస్సు, వ్యాన్ తదితర వాహనాలను నడపాల్సి వుంటుంది. ఇటువంటి పరిస్థితిలో ట్రాక్ పక్కన ఉన్న రెండు లైన్లతో కూడిన విద్యుత్ స్తంభాలు ఉండట. అలాగే ట్రాక్‌పై విద్యుత్ తీగలు వెళ్లడం వల్ల టెస్టింగ్‌కు వచ్చే ఆందోళన చెందుతున్నారు.

రెండేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా..

డ్రైవింగ్ టెస్టు నిర్వహించే ట్రాకింగ్ ప్రదేశంలో కరెంటు స్తంభాలు, అడ్డంగా విద్యుత్ తీగలు ఉండటం వల్ల ప్రమాదకరమని, వాటిని తొలిగించాలని రెండేళ్లుగా రవాణాశాఖ చెబుతూ వస్తోంది. అయినప్పటికీ కరెంటోళ్లు ఏ మాత్రం పట్టించుకోలేదని టెస్టింగ్‌కు వచ్చేవారు ఆరోపిస్తున్నారు. కరెంట్ తీగలను, స్తంభాలను తొలగించాలని రవాణాశాఖను టెస్టింగ్‌కు వచ్చే అభ్యర్థులు కోరుతున్నారు. ఇందుకు తాము ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు చెబుతున్నామని తెలుపుతున్నారు. ఈ విషయంపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా కరెంటు స్తంభాలు, ట్రాక్ పైన వెళుతూ తీగలను తొలిగించాలని తాము అనేక మార్లు చెప్పామన్నారు. కాగా ఇదే ప్రాంతంలో ఉన్న మరో ఆఫీసు డీఎస్పీ కార్యాలయం కరెంటు సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన కరెంట్ పోల్‌కు ఇప్పటి వరకు వైర్లు బిగించలేదు. డెమోకారిడార్ ఫోర్ నుంచి డీఎస్పీ ఆఫీసుకు కరెంటు తీసుకునే పరిస్థితులు ఉన్నాయి.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సంబేపల్లె : మండల కేంద్రంలో మంగళవారం ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు మండల పోలీసులు తెలిపారు. వివరాలు ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

వరిలో ఆకునల్లిని నివారించండి

సిద్దవటం : వరిలో ఆకునల్లిని గమనించామని ఏఓ కె.రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వంతాటిపల్లె, జంగాలపల్లెల్లోని వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. పంటకు నల్లి ఆశించిందని దీనికి ప్రతి రైతు ప్రొఫెనోపాస్ ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ లేదా ఓమైట్ మందును ఒక లీటరు నీటికి ఒక ఎంఎల్ చొప్పున మందులను పిచికారీ చేసుకోవాలన్నారు.

ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం కార్యదర్శిగా అనిల్‌కుమార్

సుండుపల్లె : ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల సురేష్‌బాబు నుంచి ప్రకటన వెల్లువడినట్టు మంగళవారం ఇక్కడి విలేకరులకు చెప్పారు.

ప్రేమించి మోసం చేశాడంటూ యువతి ఫిర్యాదు

సుండుపల్లె : వీరబల్లి మండలం ఈడిగపల్లెకు చెందిన మౌలీ అనే వ్యక్తి తనను ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ సుండుపల్లెకు చెందిన ఓ యువతి పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం యువతీ తన తల్లిదండ్రులతో మండల కేంద్రంలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి

సిద్దవటం : వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలోని హెచ్‌పీసీఎల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ సూచనల మేరకు వాహనదారులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాదారులకు, పిలియన్ డ్రైవర్‌లు హెల్మెట్లు ధరించాలని సూచించారు. అనంతరం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ యాజమాన్యం వారి సహకారంతో హెచ్‌పీసీఎల్‌లో, భాకరాపేట ప్రధాన బస్టాప్‌లో ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. తదనంతరం భాకరాపేట సర్కిల్ నుంచి మాధవరం–1 సర్కిల్ వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ సతీష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.ఓబయ్య, చీఫ్ మేనేజర్ సతీష్, హెచ్‌పీసీఎల్ అధికారులు, కార్మికులు మహిళలు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో సాంకేతిక జోడింపు అవసరం

రైల్వేకోడూరు అర్బన్ : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక అనంతరాజుపేటలోని కళాశాల విద్యార్థులకు ఉద్యానసాగులో సాంకేతికత జోడింపు అవసరంపై మంగళవారం ఉద్యాన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ గోపాల్ అధ్యాపకులకు, విద్యార్థులకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిశ్రమ అభ్యాసన ప్రక్రియ ద్వారా శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. నేటికాలంలో నూతన సాంకేతిక పద్ధతులు ద్వారా ఆవశ్యకతను వివరించారు. ఉద్యానసాగులో వస్తున్న మార్పుపట్ల విద్యార్థులు, రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా కూరగాయల సాగులో మెళకువలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పీజీ డీన్ సూర్యకుమారి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్, సుదీప్ మార్య, డాక్టర్ బీ శ్రీనివాసులు, డాక్టర్ ప్రదీప్ కుమార్, క్రాంతిరేఖ, శశికళ, యువరాజ్, సీహెచ్ రూత్, రాజ్యలక్ష్మీ, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, లలిత, జయప్రియ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో కళావేదికను ఏర్పాటు చేయాలి

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని కోదండరామ స్వామి గెస్ట్‌హౌస్‌లో మంగళవారం సీపీఎం పార్టీ శాస్త్రీయ, రాజకీయ శిక్షణా తరగతులను ఆ పార్టీ కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం స్థాయిలో ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వాలు చట్టసభల్లో హామీ ఇచ్చినా నేటికి ప్రణాళికలు తయారు చేయలేదన్నారు. జానపద ప్రదర్శనలకు ప్రత్యేక కళావేదిక ఏర్పాటు చేసి కళాకారులకు అలవెన్సు అందించాలన్నారు. కోదండరాముని భక్తుడైన దళిత ఓబులదాసును గుడిలోకి రానివ్వకపోతే భక్తుని కోసం కోదండరాముడే ఓబులదాసు వద్దకు వచ్చి వెళ్లేవాడని స్థల పురాణాలు చెబుతున్నాయని, అంతటి దళిత భక్తుడైన ఓబులదాసు గుడిని ఆధునీకరించి అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటకుల సౌకర్యం నిమిత్తం ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషనను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన భూములు కబ్జా కాకుండా అధికారులు కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో కోనేటి నరసయ్య, ఐఎన్ సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్, వి.అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌పీ అల్లావలి పేర్కొన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్క్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ అనేది లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు చెడుదారిలో నడవకుండా మంచి ప్రవర్తన అలవరుచుకోవాలన్నారు. ఎయిడ్స్‌పై అనుమానాలు ఉన్నవారు వెంటనే 1097ను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. యువత గ్రామీణ ప్రాంత వాసులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం హెచ్‌డీఎస్ వార్షిక బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను మంచిగా చూసుకుని, వారు చెప్పే అనారోగ్య సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి వారికి కావాల్సిన వైద్యం అందించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు కావాల్సిన పరికరాలను, మందులను అందించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, వైద్య అధికారిణి మనీషా, సిబ్బంది కల్పన, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గానికి ఆధ్యాత్మికతే దిక్సూచి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



రాజంపేట టౌన్: పూజల్లో పాల్గొన్న ఆకేపాటి



సిద్దవటం: నూతన వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : మనిషి సన్మార్గంవైపు పయనించడానికి ఆధ్యాత్మికత దిక్సూచిలాంటిదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆకేపాటి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఇస్కాన్ సంస్థ సమాజంలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించి తద్వారా ప్రజలను సన్మార్గం వైపు నడిపించేందుకు విశేషంగా కృషి చేస్తుండం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథరెడ్డి, రెడ్డిమాసి రమేష్ నాయుడు, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, అమర్, చికెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన..

సిద్దవటం : నేకనాపురం గ్రామంలో మంగళవారం నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిలు ఆశీర్వదించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు కుమార్‌రెడ్డి కుమార్తె లక్ష్మిప్రతిమ వివాహ రిసెప్షన్‌కు మంగళవారం వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులైన లక్ష్మిప్రతిమ, మనోజ్‌కుమార్‌రెడ్డిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.చంద్రశేఖర్‌రెడ్డి, రమాదేవి, సర్పంచ్‌లు ఈశ్వర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రైతువిభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి , మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి వల్లిచాన్, శోభన్‌రెడ్డి యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుండుపల్లె : కేకే కల్యాణ మండపంలో గంగిరెడ్డిపల్లెకు చెందిన బాల్ రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ రెడ్డి, రోహిణీల వివాహ వేడుకకు ఆకేపాటి అమరనాథరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి, ఆనందరెడ్డి, మోహన్‌రెడ్డి, భగీరథరెడ్డి, రెహమాన్‌ఖాన్, బాబురెడ్డి, అజయ్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆదాంలతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ సొంత ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేయిస్తున్న పోలా

రాజంపేట టౌన్ : సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు సంబంధించిన వాల్వ్‌లు దెబ్బతిన్నాయి. దీంతో గత మూడు రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి సత్వరమే స్పందించారు. మున్సిపాలిటీకి చెందిన ట్యాంకర్లతోపాటు చైర్మన్ తన సొంత ట్యాంకర్ ద్వారా పలు కాలనీలకు మంచినీటిని సరఫరా చేయించారు. స్థానికులకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమాజాభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర

రాజంపేట : సమాజాభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర అని అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డా.స్వర్ణలత అన్నారు. మంగళవారం ఫార్మసీ ఆడిటోరియంలో మహిళా సమానత్వ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతోపాటు మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అన్నింటిలోనూ మహిళలు పురుషులతో పోటీపడుతున్నారు. అక్షరాస్యతలో మహిళలు ముందుంజలో ఉన్నారన్నారు. పోటీ పరీక్షలలోనూ మహిళలు తమ ప్రతిభను చాటుకున్నారు. సివిల్స్ నుంచి క్లారికల్ వరకు మహిళలు ఓపెన్ కేటగిరిలో పోటీ పడి సక్సెస్ అవుతున్నారన్నారు. ఒకప్పుడు గడప దాటాలంటే భయపడే మహిళలు ఈరోజు అంతరిక్షం వైపు అడుగులు వేస్తున్నారన్నారు. కల్పనా చావ్లా, ద్రౌపదీ ముర్ము, నిర్మల సీతారామన్ లాంటి మహిళలను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి మహిళా తమ జీవితానికి ఒక గమ్యం, ఆశయంతో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో డా.ప్రవీణ, నిర్మలదేవి, డా.పి.అనిత, డా.దీప, డా.శిరీషలు పాల్గొన్నారు.

కబ్జాదారుపై చర్యలు తీసుకోండి

రామాపురం : బండపల్లి గ్రామ పరిధిలోని శ్మశానవాటికను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలియజేశారు. సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత 100 సంవత్సరాల క్రితమే చనిపోయిన దళితులను సర్వేనెంబరు 307/1లోని 90 సెంట్ల భూమిలో పూడ్చుకునేవారన్నారు. ఈ మధ్యకాలంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన కొందరు దళితుల శ్మశాన వాటికతో సహా మొత్తం భూమిని కొనుగోలు చేశామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ దళితుల శ్మశాన వాటికను కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల శ్మశానవాటిక స్థలాన్ని వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి సురేంద్ర, దళితులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఓబులవారిపల్లె : రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో సంజీవపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ మన్సూర్ అలీ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈనెల 25, 26వ తేదిలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ఒకరు బంగారు పతకం, 12 మంది కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

పెనగలూరు : కొండూరులో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి తెలిపారు. ఈ ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు విజయ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలు, అభిషేకాలు, హోమాలు అనంతర రాత్రి టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమాచార్య కీర్తనల కార్యక్రమాలు అలరించాయి. కాగా చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుపనున్నట్లు కొండూరు విజయ్‌రెడ్డి తెలిపారు.

ఆలయానికి విరాళం అందజేత

చిట్వేలి : మండల పరిధిలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి నందలూరు మండలం కుమ్మరపల్లి ఇసుకపల్లికి చెందిన పోలి నాగరాజు ఆలయానికి రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. అలానే ఓబులవారిపల్లెకు చెందిన మణిశ్విన్ రెడ్డి, కుటుంబ సభ్యులు మఖర తోరణానికి రూ. 59 వేలు ఆలయ ధర్మకర్త కట్టా రామ్మోహన్ రావుకు అందజేశారు.